కథానిక

# నాన్నకో ఉత్తరం

## వి. ప్రతిమ

"ఇయ్యాలయినా అమ్మికి జాబు రాసినావా లేదా?" వీధి చివరి నుండి మోసుకొచ్చిన మంచినీటి బిందెను పొయ్యి పక్కనే దించుతూ కొంచెం బిగ్గరగా ప్రశ్నించింది జానకి... చాల సేపట్నుండీ కొళాయి వద్ద పోరుకు లాడినట్లుగా ఆమె జుట్టు చెరిగి వుంది... నుదుట పట్టిన చెమటకి బొట్టు చెమరి వుంది.

తనంత బరువున్న బిందెను మోసుకు రావటం వల్ల ఆయాసంతో ఆమె గుండె ఎగిసెగిసి పడ్తోంది. చీర చెరుగుల్ని మట్టసంగా కుచ్చిళ్ళలోకి మడుచుకుని పొయ్యి దగ్గర వొంగుతూ భర్తకేసి చూసింది జానకి.

అప్పుడే ఆఫీసు నుండి వచ్చి అరజగ్గు నీళ్ళతో ముఖం, కాళ్ళూ చేతులూ కడిగేసుకుని పుస్తకాలు ముందేసుకుని కూర్చుని వున్నాడు మనోహరం.

పొయ్యిలో రెండు తాటాకు మట్టలు పెట్టి వంట చేస్తూ పొద్దుట మిగిలి వున్న టీ నీళ్ళని వెచ్చజేస్తూ వుంది జానకి.

"యినపడ్డాదా?" పుల్లల్లాటి చేతుల్తో పొయ్యెక్కేస్తూనే రెట్టించింది.

"ఊ" కాడ విరిగిన కళ్ళజోడును దారం కట్టి రిపేరు చేసుకుంటూ జవాబు చెప్పాడు మనోహరం తప్పదన్నట్లుగా.

"దేనికి ఊ కొట్టినట్టు... యినపడ్డాదనా... జాబు రాశావనా?" విసుక్కుంది జానకి టీనీళ్ళందిస్తూ.

కప్పందుకుంటూ భార్య వంక చూశాడు మనోహరం. క్షణకాలంపాటు అతడి హృదయం చుట్టూ ఏర్పరచుకున్న ఇనుప వలయం ఒకింత సడలినట్టయింది... ఈ జానకి తమ పెళ్ళయిన కొత్తల్లో ఎంత అందంగా, నాజూగ్గా వుండేది... మరెంత నాజూగ్గా మాట్లాడేది?... మకరందపు భారంతో మత్తెక్కి తూగుతున్న పువ్వులా... అలలా వుండేది...

మరి యిప్పుడో... జీవితపు అనేకానేక అనుభవాల, అవమానాల పరంపరతో బరువెక్కి వడలిన పండుటాకులా వుంది.. . బాధ్యతలు భావుకత్వాన్ని మింగేస్తాయా? ఆర్థిక యిబ్బందులనేవి మనిషిలోని సహనాన్నే కాకుండా అందాన్ని, నాజూకుతనాన్ని వీణలాంటి గొంతునీ కూడా హరించి వేస్తాయా? ఆరోగ్యం సరే ఎలాగూ హరించుకుపోయింది... గుంటలు పడ్డ జానకి కళ్ళనీ, ఎండిపోయి రొప్పుతూన్న జానకి గుండెల్నీ నిశితంగా పరిశీలిస్తూ మౌనంగా కప్పు వోటి కానించాడు మనోహరం. అతడికి తెలుసు తనకి మాత్రమే సాయంత్రం పూట టీ నీళ్ళు... జానక్కి వుండవు... అయినా అదేమీ గమనించినట్లుగా నటిస్తాడతడు.

పొయ్యి మీద ఎసురు పడేసి చాట్లో బియ్యం పోసుకుని తెచ్చి మనోహరం పక్కనే వాకిట్లో చతికిల బడింది జానకి. ఉన్న ఒకే ఒక గూడులాంటి గదిలోపల ఎప్పుడూ చీకటే... బిల్లు కట్టలేదని ఆ ఉన్న ఒక లైటూ పెరికేశారు కరెంటోళ్ళు.. . వందలొందల ఎకరాలకు నీళ్ళు పారించుకుంటూ మోటార్ల మీటర్లు ఆడకుండా అడ్డం పెట్టి భూస్వాములెవరూ ఈ కరెంటోళ్ళకు కన్పించరు... తమలాంటి ఒక్క లైటు గాళ్ళే అవుపడ్తారు... అయితే జీవితంలోని చీకటితో పోల్చుకుంటే గది లోపలి చీకటి పెద్దనల్లగా ఏమీ లేదు జానక్కి.

తలొంచుకుని బియ్యం ఏరుతోన్న జానకి కళ్ళూ, గుండే కూడా బరువెక్కాయి... ఉద్వేగాన్ని అవుకోవడం ఎంతో కష్టంగా వుందామెకి. ఒక్కగానొక్క కూతురు వసంతని తమకు వుండి తిన్నా, లేక పస్తులున్నా ఎంతో గారాబంగా పెంచుకున్నారు... ఏదోలే గంతకు తగ్గ బొంత అనుకోకుండా తమకు మించినట్లుగానే యిచ్చిచేశారు. .. అబ్బాయి శ్రీరాములు ఒంగోల్లో టీచరుగా పని చేస్తున్నాడు. ఆ సాంగ్యాలూ, ఈ సాంగ్యాలూ అంటూ అత్త బాగానే లాగింది. అయితే మాత్రమేం తమకిది భారమైతే అయ్యిండొచ్చు గానీ... వాళ్ళ తాహతుకది ఎక్కువేమీ కాదు... ఏదో బాగానే వుందారు, అట్టా జరిగిపోతా వుంది కదాని మొదులు పట్టించుకోకపోతే యెట్ట...? బిడ్డ గర్భంతో వుందని తెలిసి కూడా ఒక్కసారయినా పొయి రాలేకపోతిమి... అయిదో నెల్లో సారెబెట్టి ఘనంగా తీసుకురావల్సింది, అదేమీటే ట్రాన్స్ఫర్... ట్రాన్స్ఫర్... ట్రాన్స్ఫరయి మనం ఛస్తుంటే ఏందే సారె పెట్టేది, గీరె పెట్టేంది' అంటూ తీసిపారేశె... ఇయ్యంతా వోళ్ళకెట్టా తెలస్తాయి... లేవలేని బిడ్డ అత్తా, ఆడబిడ్డల కాడ ఎట్టుందాదో ఏమొ...?" ముక్కు ఎగచీల్చుకుంటూ లోలోపలే గొణుక్కుంటూ వుంది జానకి.


జానకి మాటలు చెవులకి స్పష్టంగా విన్పించకపోయినా, ఆమె చెప్తేదేమిటో మనసుకయితే స్పష్టంగా తెలుస్తూనే వుంది మనోహరానికి.

"కూతురికి తొమ్మిదో నెల పెట్టింది. ఎప్పుడో అయిదో నెల్లో వెళ్ళి సారెబెట్టి తీసుకొచ్చి సీమంతం చేసుండాల్సింది.. కానీ అదే సమయానికి యెంతో కాలంగా వుండిపోయిన చిట్టమూరు నుండి మండల కేంద్రమయిన ఈ వూరికి ట్రాన్స్ఫరవడంతో కుటుంబాన్ని అటునండి ఇటు తరలించడం... శక్తికి మించిన భారమైపోయింది మనోహరానికి.

చిట్టమూర్లో రెండెకరాల నేల వుందనే... అప్పట్లో చిట్టమూరు మండలమవగానే కావాలని పెద్దోళ్ళందరి కాళ్ళా, వేళ్ళాపడి... బతిమాలుకుని, బామాలుకుని అక్కడికి వేయించుకున్నాడు. కొన్నాళ్ళు బాగానే గడిచింది.

ఇంటిల్లిపాదీ అష్టకష్టం చేసి ఆ నేల్లో చెనగ యేస్తే తొలినాళ్ళలో కొంత ఫర్వాలేదు. అసలుకు అసలయినా అయ్యేది... ఈ తరువాత్తర్వాత ఎండాకాలం నీళ్ళు లేక, వానాకాలం వరదలొచ్చే పంట చేతికొచ్చేదే కాదు... అధవా వచ్చినా ధర పలికేది కాదు. ధర ఎక్కువగా వున్నా దళారుల కింద నలిగిపోయేది. ఇట్టనే నలిగి, నలికి బతుకెళ్ళ మారుస్తా పదేళ్ళు తిరిగేటప్పటికి కూతురి పెళ్ళికి అమ్మేసిన ఒకటిన్నరెకరాల పొలం పోగా మిగిలిన అరెకరాతో పాటు యిరవై వేల అప్పు మిగిలింది. ఇహన ఆ వూళ్ళో వుండి కట్టైలమ్మ లేక మళ్ళీ ఆ పెద్దోళ్ళ కాళ్ళనే పట్టుకుని ఇదిగో ఈ వూరికొచ్చేశాడు.

ప్రభుత్వం కూడా చిత్రమైందే... అదేమిటో కానీ రెవిన్యూ, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంటుల్లో వున్నట్టుగా పై ఆదాయాలూ, ప్రమోషన్లూ ఈ మండలాఫీసుల్లో పెద్దగా వుండవు. అటెండరుగా చేరి అతికష్టం మీద రికార్డసిస్టెంటయ్యాడు తను... వచ్చే జీతంతోనే భార్యాబిడ్డల్నీ, తల్లిదండ్రుల్నీ చాకుతూ నెట్టుకొచ్చాడు. ఎట్నోనాయినా తిరుగులాడ్తా తిరుగులాడ్తా వుండంగానే రెడ్డోళ్ళ చెరుకు తోటదార్న వస్తావుంటే పాముకరిచి చచ్చిపోయినాడు... జరిగేవన్నీ మన మంచికే అనుకున్నాడు తను... అమ్మని మాటా




తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) రాజాలక్ష్మీ ఫౌండేషన్ (మద్రాసు) ఆంధ్యజ్యోతి సచిత్ర వార పత్రిక సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ (1997)లో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ.

మంచీ చెప్పి తమ్ముడితో పంపేసినాడు. పెద్దకోడలు దగ్గర్నుండి పోవడానికి ఏ మాత్రం యిష్టం లేక వెళ్తూ వెళ్తూ తల్లి చూసిన చూపుని మనసు చుట్టూ ఏర్పరచుకున్న వలయం నుండి లోపలికి రానీయలేదు... అప్పటికే ఆ వలయం పటిష్టతను సంతరించుకుంది.

నాయిన పొయ్యేనాటికి నేల అమ్ముకోలేదు... అప్పటికి ఒక్క పైసా అప్పూ లేదు... పది పైసలు డబ్బూ లేదు. అవతలవతల... ఏం జరిగి పొయ్యిందో, ఎప్పుడు మొదలయ్యిందో కానీ అప్పడు చేయడం అన్నది చాప కింద నీరులా చేరిపోయింది... ఎప్పటికప్పుడు 'ఇదిగో ఈ ఒక్కసారికేలే... రేపు మంటొస్తే యిచ్చేస్తే పోతాది" అంటూ అంచెలంచెలుగా అప్ప జమవుతా వచ్చింది.

కొడుకు రవికి తాము జీవించే దుర్భర జీవితం పట్ల ఏవగింపు. చేతగాని తండ్రి మూలంగానే జీవితాలీ విధంగా తయారయ్యాయని హేళన... కసి... ఈ వూరి కొస్తానే చదువు మాన్పించి, శెట్టంగట్లో పనికి కుదిర్చాడని తండ్రి మీద రేగిన కోపంతో పాపం రవి మంచి అబ్బాయి కాబట్టి తండ్రిని ఏమీ అనలేక ఇల్లు వదిలి పారిపోయాడు.

అదీ ఒకందుకు మంచిదే... ఈ ఇరుకు యింట్లో కన్నా సువిశాలమయిన ప్రపంచంలో జీవితాన్ని తెలుసుకోవడానికి ఎక్కువగా అవకాశాలుంటాయనీ, ఏదో ఒకనాటికి తన కొడుకు ప్రయోజకుడయి తిరిగి వస్తాడనీ గట్టి నమ్మకం మనోహరానికి.

భార్య ముక్కి గబీలుస్తూ ఛర్రు ఛర్రున బియ్యం చెరుగుతోన్న శబ్దంతో చప్పున ఈ లోకంలోకొచ్చి పడ్డాడు మనోహరం.

"మూసిన ముత్యం... పాసిన పగడం మాట్లాడితే యాడ ముత్యాలు రాలి పడిపోతాయో, ఏరి మూట గట్టుకుంటామనుకుంటాడు. యాడా జోళ్ళేదమ్మా యిట్టాటి మొగుడ్ని..." ఒక వంక బియ్యం చెరుగుతూనే భర్తనీ చెరుగుతోంది జానకి.

మనోహరానికి జానకిని చూస్తుంటే చెప్పలేనంత జాలేసింది. తన నిస్సహాయతకి తన మీద తనకే కోపంగానూ వుంది... అవును తను వసంతకి జాబు రాయలేదు... రూపాయి పెట్టి కవరు కొన్లేక అన్నదొక్కటే సత్యం కాదు. ఒక్క రూపాయే అయితే అప్ప దొరుకుతుంది. ఆ రూపాయితో కవరు కొనేసి అందులో వ్రాయాల్సిన విషయాలు చాలా ధర పలుకుతాయి మరి. పెళ్ళి అమ్మాయిని తీసుకొస్తానని వ్రాయాలి. తీసుకొచ్చి కానుపు చేయించి... బాలసార చేయాలి... తల్లీ బిడ్డల్ని మూడో నెలదాకా వుంచుకోవాలి. ఈ లోపల అల్లుడు పదే పదే వచ్చిపోతాడు... అత్తా, ఆడబిడ్డలూ వస్తారు. ఇంకా తెలిసున్న వాళ్ళంతా వస్తారు. ఇదంతా ఒక్క రూపాయితో తేలేవి కావు. అందుకే జానకి మాట ఖాతరు చేయకుండా వాయిదా వేస్తూ వచ్చాడిన్నాళ్ళూ.

జానకి సన్నగా ఏడుస్తోంది.

గర్భవతి అయిన కూతుర్ని చూసుకోవాలనీ, దగ్గరుండి రుచిగా వండి పెట్టాలనీ ఆమెకు చాలా ఆశగా, యిష్టంగా వుంది. మనసు బలహీన పడినప్పుడల్లా కొడుకెక్కడున్నాడో, ఏం చేస్తున్నాడోనన్న దిగులు ఆమెను చుట్టేస్తుంది. రెండూ కలిసి కలగావులంగా ఆమె మనసును బలంగా పిండేస్తున్నాయి.

"ఏడుపాపు" గద్దించాడు మనోహరం. అతడు అప్పడప్పుడూ తన నిస్సహాయతను పెత్తనం రూపంలో బహిర్గతం చేసి ఆమె నోరు మూయిస్తుంటాడు చాలామంది మగాళ్ళలాగే...

"ఎవరు చచ్చారనిప్పుడు?... రాస్తాన్లే. రేపు రాస్తానన్నాను గదా నోర్మూసుకో..." విరుచుకుపడ్డాడు.

గుడ్లలో నీటిని గుడ్లల్లోనే... గుండెల్లో బాధని గుండల్లోనే అణచిచేసుకుని చప్పున లేచి చాటతో లోపలికెళ్ళిపోయింది జానకి.

ఈసారి జానకి మీద కోపమూ, జాలీ కలగావులగంగా కలిగిందతడికి.

ఆ రాత్రి అభోజనంగా పడుకుని నిద్రలేమితో బాధపడ్తోన్న భార్యని ఓదార్చాలని యెంతగానో అన్నించినా... చాల గట్టిగా, బెట్టుగా వుండిపోయాడు. జానకిని దగ్గరకు తీసుకుని చనువిస్తే ఏమవుతుందో అతడికి బాగానే తెలుసు.

> "కన్నపేగు
> విషయంలో కూడా
> మమతకు
> స్వార్థం అడ్డం వస్తే...."

కరిగినీరయి ఆతడితో మొదలయిన లేలేత నిష్ఠురాలు తమ పెళ్ళయిన్నాటి నుండీ పడిన కష్టాల జాబితాతో సుదీర్ఘ రామాయణమై... కొడుకు వెళ్ళి-పోయిన్నాటి సంఘటనతో ముగుస్తుంది. ఇదే అవకాశంగా తన నిస్సక్షాతను చేతగాని తనాన్ని ఆమే ఏ కరువు పెడ్తూంటే వినడానికీ, ఒప్పుకోవడానికీ మనోహరం సిద్ధంగా లేడు... అలాగని అమెను సంతోషపెట్టడం కోసం కూతుర్ని తీసుకొచ్చి లోకం కోసమే అయినా కానుపు చేయించి... తన అప్పలో మళ్ళీ మరో అయిదారు వేలు జమ చేయడానికి సుముఖంగానూ లేడు. ఏం చేయాలో తెలీని తనంతోనే రాత్రిని తెల్లారిస్తూ... వేకువన ఒక నిర్ణయానికొచ్చాడు మనోహరం ఆ రోజు ఎలాగయినా కూతురికి వుత్తరం వ్రాయాలని.

తమున్న ఈ మండలం ఈ చుట్టు పక్కల అన్నిట్లోకి పెద్దది. సీనియారిటీ ప్రకారం మరొకరికి రావల్సిన ట్రాన్స్‌ఫర్ తనికి రావడంతో వాళ్ళ రిపోర్ట్ మేరకు తనని మళ్ళీ మరో చోటికి మారుస్తున్నారనీ, ఆ గొడవలో తిరుగుతూ తను కూతుర్ని తీసుకు రాలేకపోతున్నాననీ, త్వరలోనే రావడానికి ప్రయత్నిస్తాననీ వ్రాసి పోస్ట్ చేయాలనుకున్నాడు.

ఆ తరువాత అతడికి ప్రశాంతంగా నిద్రపట్టేసింది.

** ** ** **

ఆ మర్నాటి సాయంత్రం... మౌనంగా, నిర్వికారంగా 'టీ' అందిస్తోన్న జానకిని చూసి చప్పున గుర్తొచ్చింది మనోహరానికి. ఆఫీసులో రద్దీగా వుండడంతో పూర్తిగా చదవకుండానే లోపల పెట్టేశాడు... కూతురి ఉత్తరం చూట్టంతోనే తను వ్రాయాలనుకున్న వుత్తరాన్ని మళ్ళీ వాయిదా వేశాడతడు.

తాపీగా 'టీ' త్రాగి కూతురి వుత్తరం విప్పాడు.

ప్రియమైన నాన్నకు,

వసంత నమస్కరించి వ్రాయునది... ఇక్కడంతా బాగానే వున్నారు... అక్కడ మీరెలా వున్నారని నేనడగను... మీరెలా వున్నారో తెలుసు కాబట్టి... మొన్న డాక్టరమ్మకి చూపించుకుని తిరిగొస్తుంటే సెంటర్లో రామచెంద్ర మామ కన్పించి చెప్పాడు. 'అమ్మ నిండా నీరసంగా తగ్గిపోయి వుందనీ, నాయిన ఎప్పటి మాదిరిగానే వుండాడనీ, తమ్ముణ్ణి చదువు మాన్పించి శెట్టంగట్లో పెట్టారనీ... అన్ని విషయాలూ...' నాన్న జాబు రాయలేదని నేను కష్టంగా వుంటే సర్ది చెప్పినాడు.

నాన్నా! కూతురు గర్భవతి అని తెలిస్తే సంతోషించడానికి డబ్బు తెర అడ్డమొచ్చేస్తుంది మధ్య తరగతి తల్లిదండ్రులకు... అయిదో నెల్లో నన్ను సారెబెట్టి తీసుకెళ్ళలేదనీ, అచ్చటా ముచ్చటా తీర్చలేదనీ మా అత్త చాలా కోపంగా వుంది. ఆడబిడ్డకి నా వుట్టింటోళ్ళు ఏమీ జరపలేరనీ, అన్నీ ఇక్కడే జరిపించుకుంటున్నాననీ ఎగతాళిగానూ, కంటగింపుగానూ వుంది... నాన్నా! నువ్వు నాకు లోకజ్ఞానం నేర్పితే అమ్మ ఎంతో సహనాన్నిచ్చింది. అంత నిండు సహనమూ ఈ యింట్లో తేలిపోతుంది నానా...

నాకు తెలుసు నాన్నా నువ్వేమంటావో... "ఏం చేయనమ్మా జీతం అంతంత మాత్రమే... పంట చూస్తే వానాకాలం నీటిముల్లు గుచ్చితే, ఎండా కాలం కరెంటు పురుగు తినేస్తోంది" అంటావు... అవన్నీ వీళ్ళకెందుకు నాన్నా?... ఒక ఆడపిల్ల, స్త్రీ గర్భవతి అయితే ఎంతటి గడ్డుస్థితిలో వున్నా తండ్రే కానుపు చేయించాలన్న దుష్ట సాంప్రదాయాన్ని యిప్పటికిప్పుడు నువ్వు, నేనూ ఏం చేసి మార్చగలం చెప్ప నాన్నా?... నువ్వు అప్పే చేస్తావో, అడివే నరుకుతావో వీళ్ళకనవసరం... సారె బెట్టి తీసికెళ్ళి పురుడు పోయాల్సిందే...

నాన్నా! ఎవరయినా చుట్టాలు మనింటికొస్తామని వ్రాసినపుడు నాకు ట్రాన్స్‌ఫర్ అవుతోందనీ, దయచేసి నేను వుండను కాబట్టి మీరు రావొద్దనీ వ్రాసేవాడివి. ఖర్చులు తట్టుకోలేక... మొన్న అయిదో నెల్లో నువు ట్రాన్స్‌ఫర్ సంగతి వ్రాసినపుడు ఆ నిజాన్ని నాలోనే మింగుకున్నాను. మరిపుడు కానుపు సమయంలో ఏ సాకు చెప్తావు నాన్న?

– జాలిగా వసంత.